క్లుప్తంగా

కార్మిక పోరాటయోధుడు రాజలింగం


నివాళి అర్పిస్తున్న విశ్వనాథం

ఇబ్రహీంపట్నం: కార్మిక పోరాట యోధుడు రాజలింగం అని ఆయన పోరాట స్ఫూర్తిని మర్చిపోలేమని సీపీఐ జిల్లా నాయకుడు చెన్న విశ్వనాథం అన్నారు. ఈ మేరకు బుధవారం మండలకేంద్రంలో రాజలింగం ప్రథమ వర్ధంతి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, జిల్లా కార్యదర్శి ఎండీ ముక్రం, మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్, నాయకులు ఎన్నం రాధ, మధురమ్మ, రాజలింగం కుటుంబ సభ్యులు రాఘు, రాజేశ్వర్, ప్రసాద్ పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌లోని లోపాలను సవరించాలి

జగిత్యాల: మాస్టర్ ప్లాన్‌లోని లోపాలను సవరించాలని 35వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ పరిధిలోని టీఆర్ నగర్‌ను మున్సిపల్‌లో కలిపి టీఆర్‌నగర్‌కు ముందున్న ధరూర్‌ను మున్సిపల్‌లో కలపలేదని, మాస్టర్‌ప్లాన్‌లో పొందుపర్చాలన్నారు. పట్టణ విస్తీర్ణం పెంచుతామని ఎక్కడా చూపలేదని, విస్తీర్ణం పెంచేలా డ్రాఫ్టింగ్ యారు చేయాలని కోరారు. అనేక లోపాలున్నాయని, వాటిని సవరించాలన్నారు.

నేతకాని ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్మపురి: నేతకాని మహార్ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 22న పెద్దపల్లి జిల్లా రామగుండంలో నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక నేతకాని నాయకుల ఆధ్వర్యంలో బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశానికి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేత, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నేత, స్టేట్ ట్రైబల్ వెల్ఫేర్ చీఫ్ ఇంజనీర్ ముడిమడుగుల శంకర్, ప్రొఫెసర్ జాడి ముసలయ్య హాజరవుతారని తెలిపారు. దుర్గం రవి, దుర్గం రాజేశ్, పిప్పల గంగాధర్, కామెర సుధాకర్, దుర్గం శ్రవణ్, చెరుకు కేశవయ్య పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

కొడిమ్యాల: ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలో 2019 జనవరి నుంచి 2022 మార్చి వరకు చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పద్మజరాణి తెలిపారు. ఆయా పనులపై సామాజిక తనిఖీ బృందాలు నిర్వహించిన తుది నివేదికను చదివి వినిపించనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి కూలీలు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

గోదారంగనాథుల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

కోరుట్లరూరల్: మండలంలోని జోగిన్‌పెల్లి శివారులో గల గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో బుధవారం గోదాదేవి రంగనాథుల కల్యాణం వైభవంగా జరిగింది. సర్పంచ్ దుంపాల నర్సు, పురోహితులు, భక్తులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో ఘనంగా..


మెట్‌పల్లిలో కల్యాణ మహోత్సవం

మెట్‌పల్లి: పట్టణంలోని దుబ్బవాడ శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో బుధవారం శ్రీగోదాదేవి–రంగనాయకుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో హేమచందర్, శ్రీపతి రవి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు పర్మి నర్సయ్య, ఆర్మూర్ నరేందర్, మగ్గిడి సురేశ్, మహజాన్ శివకుమార్, వాల్గొట్ పురుషోత్తం, మర్రి భాస్కర్, తోపారపు రాజేందర్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌లతో సస్యశ్యామలం

- మండలంలో 8 గ్రామాలకు తాగునీరు
- వేలాది ఎకరాల్లో పంటల సాగు
- రూ.15కోట్లతో ఐదు చెక్‌డ్యామ్‌ల నిర్మాణం పూర్తి


బోర్నపల్లిలో పూర్తయిన చెక్‌డ్యామ్

రాయికల్: ఏటా వర్షాకాలం వృథాగా గోదావరిలో కలుస్తున్న వరదనీటిని ఒడిసిపట్టి గ్రామాలకు తాగు.. సాగునీరు అందించడంతో పాటు భూగర్భజలాలు పెంచడానికి పెద్దవాగుపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టారు. రాయికల్ మండలంలో ఐదు చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో ఎనిమిది గ్రామాలకు సాగు, తాగునీరు అందనుంది. చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో ఆయా గ్రామాల్లో భూగర్భ జలాలు పెరగడంతో వ్యవసాయ, తాగునీటి బావుల్లో నీటిశాతం పెరగనుంది.

చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి రూ.15కోట్లు..

రాయికల్ మండలంలోని ఇటిక్యాల, మూటపల్లి, కొత్తపేట, బోర్నపల్లి గ్రామాల్లో సుమారు రూ.15కోట్లతో ఐదు చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇటిక్యాల శివారులో రెండు, మూటపల్లి శివారులో ఒకటి, కొత్తపేట గ్రామంలో ఒకటి, బోర్నపల్లిలో చొప్పున నిర్మిస్తున్నారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో ఇటిక్యాల, రామరావుపల్లె గ్రామాల్లో సుమారు 800 ఎకరాలు, మూటపల్లి, కొత్తపేట గ్రామాల్లో 450 ఎకరాలు, జగన్నాథపూర్, బోర్నపల్లిలో 600 ఎకరాలకు సాగునీరు అందడంతో బీడువారుతున్న భూముల్లో సైతం రైతులు పంట పండించడంతో ఆర్థికంగా వృద్ధి సాధిస్తున్నారు. అంతేకాకుండా భూముల ధరలకు సైతం రెక్కలొచ్చాయి.

రెండు పంటలు వేస్తున్నాం



మా గ్రామంలో నాకు రెండున్నర ఎకరాల భూమి ఉంది. గతంలో పత్తిమాత్రమే పండించేవాళ్లం. ప్రస్తుతం చెక్‌డ్యామ్ నిర్మాణం పూర్తి కావడంతో నా భూమిలో వరి, పసుపు, మొక్కజొన్న పంటలు కూడా పండిస్తున్నాను. ఆర్థికంగా లాభపడుతున్నాం. – ఆత్రం లక్ష్మణ్, బోర్నపల్లి

భూములు సస్యశ్యామలం



రాయికల్ మండలంలో ఇటిక్యాల, కొత్తపేట, బోర్నపల్లి, మూటపల్లి గ్రామాల్లో చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టడం ద్వారా ఆయా గ్రామాల్లో వందలాది ఎకరాల భూములు సస్యశ్యామలం అవుతున్నాయి. గత ప్రభుత్వాలు చేయని పనులు మేము చేశాం. – సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే

అటెన్షన్ ప్లీజ్



కల్వర్టు తవ్వారు.. వదిలేశారు

కోరుట్లరూరల్: పట్టణంలోని గోదాం రోడ్డులో కోర్టు రోడ్డు నుంచి గోదాం రోడ్డువైపునకు వెళ్లె డ్రైనేజీ కల్వర్టును పైప్‌లైన్ సమయంలో తవ్వి వదిలేశారు. దీంతో ప్రయాణికులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ప్రతీ బుధవారం గోదాం రోడ్డులోనే వారసంత జరుగుతుంది. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మరమ్మతు చేపట్టాని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: ఎండీ.అయాజ్, మున్సిపల్ కమిషనర్
ఫోన్ నంబర్: 98499 05880

ఓబన్న చరిత్రను యువకులు తెలుసుకోవాలి


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

ఇబ్రహీంపట్నం: స్వాతంత్య్ర సమరయోధుడు ఒడ్డెర ఓబన్న చరిత్రను యువకులు తెలుసుకోవాలని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని గోధూర్ గ్రామంలో ఒడ్డెర కాలనీ వద్ద తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఓబన్న విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం కోసం పోరాటం చేసిన ఘనత ఓబన్నకు ఉందని, అందుకే ఓబన్న జయంతిని, వర్ధంతిని గుర్తించుకొని వేడుకలు నిర్వహించాలని ఒడ్డెర కులస్తులను ఆయన కోరారు. అనంతరం గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కళాకారులు నిర్వహించే రంబ రంపాల చిరుతల నాటకం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, సర్పంచ్ సోమ ప్రభాకర్, ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి, నాయకులు కమటం రమేశ్, జాజాల జగన్‌రావు, ఎలాల దశరథ్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు సంజీవ్, కళాకారుడు కోటగిరి సుధాకర్, సినీ నటుడు గోధూర్ మురళి, ఒడ్డెర సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట

కోరుట్లరూరల్: రాష్ట్రంలో మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని అల్లమయ్య గుట్ట పాత హాస్టల్ భవనంలో బుధవారం మైనారిటీ జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య, ప్రిన్సిపాల్ సాజిద్, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్ పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: సీఎం కేసీఆర్ ఇంటింటికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఇప్పటి వరకు 11లక్షలకు పైగా మందికి వైద్యం అందిందని, సీఎంఆర్‌ఎఫ్ ప్రతి ఒక్కరినీ ఆదుకుంటుందన్నారు. పార్టీ అధ్యక్షుడు గట్టు సతీశ్, గోలి శ్రీనివాస్ ఉన్నారు.

దళితుల ఆర్థికాభివృద్ధికే దళితబంధు

దళితుల ఆర్థికాభివృద్ధికే దళితబంధు పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఇటీవల దళితబంధు పథకం మంజూరైన లబ్ధిదారుడు రాజయ్య ఫుట్‌వేర్ షాపును ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళితబంధు పథకం ద్వారా ఒక్క రూపాయి బ్యాంక్‌లోను లింకేజీ లేకుండా నేరుగా దళితుల అకౌంట్‌లో జమఅవుతోందని, దీని ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. సీఎం అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

స్థానికంగా ఉండని వారిపై చర్యలు తీసుకోవాలి

వైద్యులు స్థానికంగా ఉండకపోవడంతో ముఖ్యంగా మాతాశిశు సంక్షేమ కేంద్రంలో గైనకాలజిస్ట్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ జి.అరుణ లేకపోవడంతో గైనిక్ పేషెంట్లు ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, కలెక్టర్‌కు లేఖ రాశారు.

కార్యకర్తల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి

రాయికల్: కార్యకర్తల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి చేస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని 3వ వార్డులోని ఇందిరానగర్ కాలనీలో కౌన్సిలర్ మారంపల్లి సాయికుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, కౌన్సిలర్లు మారంపల్లి సాయికుమార్, తురగ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత


ఎల్వోసీ అందజేస్తున్న మంత్రి ఈశ్వర్

పెగడపల్లి: పేదప్రజలు మెరుగైన వైద్యం పొందేందుకు వారికి వైద్యఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతుందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఈ మేరకు గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామానికి చెందిన సీహెచ్ శ్రీహరి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మెరుగైన వైద్యం కోసం మంత్రిని కలిశారు. కాగా బుధవారం మంత్రి కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతతో కలిసి రూ.1.50లక్షల విలువ గల ఎల్వోసీ బాధితుడి కుటుంబ సభ్యులకు అందించి నిమ్స్ ఆసుపత్రికి సిఫారస్ చేశారు.

అనారోగ్యంతో బాధపడుతున్న యువతికి..

ధర్మపురి: మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన మహశ్విని అనే యువతి అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో ఆమె కుటుంబీకులు మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి పరిస్థితి వివరించారు. స్పందించిన మంత్రి బుధవారం కరీంనగర్‌లోని ఆయన కార్యాలయంలో రూ.2.50లక్షల విలువ గల ఎల్వోసీ బాధిత కుటుంబానికి అందజేశారు.

యాదవ సంఘం భవనానికి నిధులు మంజూరు

పెగడపల్లి: గొల్లపల్లి మండలంలోని అగ్గిమల్ల యాదవ సంఘం భవన నిర్మాణం కోసం రూ.5లక్షలు మంత్రి ఈశ్వర్ మంజూరు చేశారు. సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాన్ని మంత్రి బుధవారం కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో యాదవ సంఘం నాయకులకు అందజేశారు.

కంటి వెలుగు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

కోరుట్లటౌన్/రాయికల్/కోరుట్లరూరల్/మల్యాల/మేడిపెల్లి/పెగడపల్లి/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్/సారంగాపూర్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లాలోని మున్సిపల్ కార్యాలయాల్లో, మండల పరిషత్ కార్యాలయాల్లో రెండోవిడత కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంటి సమస్యలు ఉన్న వారికి కళ్లద్దాలు, మందులు ఉచితంగా అందిస్తారని, ప్రజలు దీన్ని వినియోగించుకోవాలని కోరారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు


చిన్నారులతో నరేందర్‌రెడ్డి

జగిత్యాల: సంప్రదాయాలను మరువకూడదని అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. శివవీధిలోని ఇటెక్నో స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మానస హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ప్రదర్శనలు చేపట్టారు.

విద్యార్థులకు ముగ్గుల పోటీలు

కొడిమ్యాల: మండల కేంద్రంలోని విన్నర్స్ పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో..

మెట్‌పల్లి: పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ కళాశాల అండ్ పీజీ కళాశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

✦ దరఖాస్తుల ఆహ్వానం

కొడిమ్యాల: కొడిమ్యాల మోడల్‌స్కూల్‌లో ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. ఈనెల 15 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఏప్రిల్ 8న హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, ఏప్రిల్ 16న పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

✦ ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు..

మల్లాపూర్: మల్లాపూర్ ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అలీమొద్దిన్ బుధవారం తెలిపారు. మండల కేంద్రం శివారులో ఉన్న ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో 100 సీట్లతో పాటు 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 15వరకు గడువు ఉందన్నారు. వివరాలకు 98496 18625 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

✦ నూకపల్లి మోడల్ స్కూల్‌లో..

మల్యాల: మండలంలోని నూకపల్లి మోడల్ స్కూల్‌లో 2023–24కు గాను ఆరో తరగతిలో 100సీట్లకు గాను, 7వ తరగతి, 10వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 10 నుంచి ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సరితాదేవి తెలిపారు.

✦ రంగు మార్చకపోతే ఆందోళన

కొడిమ్యాల: మండల పరిషత్ కార్యాలయ భవనానికి వేసిన గులాబీ రంగును మార్చి ప్రభుత్వ నిర్దేశిత రంగులను వేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలకు అధికార పార్టీ రంగులు వేయడం నిబంధనలకు విరుద్ధమని, రంగులు తొలగించకపోతే మండల పరిషత్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామన్నారు.

✦ బడి బయట ఉన్న పిల్లలపై సర్వే

పెగడపల్లి: గొల్లపల్లి మండలంలోని మూడు గ్రామాల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో సీఆర్పీలు బుధవారం బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు సర్వే చేశారు. గొల్లపల్లి, చందోళీ, రాపల్లె గ్రామాల్లో సీఆర్పీలు ప్రభాకర్, లచ్చయ్య, రాజేందర్ పాల్గొని గ్రామాల్లో బడి మానేసి బడి బయట ఉన్న 6 నుంచి 14 ఏళ్లలోపు, 15 నుంచి 19 ఏళ్లలోపు ఉన్న వారిని గుర్తించి బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లను వినియోగించుకోవాలి

కొడిమ్యాల: గర్భిణులు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు కోరారు. ఈ మేరకు మండలంలోని హిమ్మత్‌రావుపేట అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు రాజమణి, సుశీల పాల్గొన్నారు.

మొగిపురుగుపై అప్రమత్తంగా ఉండాలి

కొడిమ్యాల: వరిపంటలో మొగిపురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి పి.జ్యోతి సూచించారు. ఈ మేరకు మండలంలోని నర్సింహులపల్లి, గౌరాపూర్ గ్రామాల్లోని వరిపంటలను వ్యవసాయ సిబ్బంది బుధవారం పరిశీలించారు. నర్సింహులపల్లి సర్పంచ్ ఎగుర్ల తిరుపతి, ఏఈవో శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన

మేడిపెల్లి: భీమారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో బుధవారం పోస్టల్ అవగాహన క్యాంపు నిర్వహించారు. ఈ సదర్భంగా గ్రామీణ తపాలా బీమా, సుకన్య సమృద్ధి యోజన, పొదుపు ఖాతాలు వంటి వాటిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ చెక్కపల్లి అరుణ, ఎంపీటీసీ పల్లి అర్జున్, పోస్ట్‌మాన్ వేణుమాదవ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కుడారై ఉత్సవం


హాజరైన భక్తులు


వేంకటేశ్వరస్వామి ఆలయంలో నివేదన

కోరుట్లటౌన్: పట్టణంలోని పురాతన శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, శ్రీఅష్టలక్ష్మి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం కుడారై ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా సుప్రభాత సేవ, ఆరాధన, తిరుప్పావై సేవ, పల్లకిసేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి విక్రమ్, సహాయ అధికారి నర్సయ్య, ఆలయ అర్చకులు బీర్నంది నరసింహాచారి, సహాయక పూజారి బీర్నంది శ్రీనివాసాచారి, ఆండాళ్ గోష్ఠి బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఇటిక్యాలలో..

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కుడారై ఉత్సవం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు జగన్మోహనాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు సురకంటి నాగిరెడ్డి, బోడుగం మల్లారెడ్డి, శ్రీనివాస్, రఘునాథచార్యులు, విజయలక్ష్మి, సామల్ల వేణు, ఆదిరెడ్డి, రొట్టె శ్రీధర్ పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు


జగిత్యాలక్రైం: క్రీడాకారులతో సీఐ, ఎస్సై

కోరుట్లరూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కోరుట్ల పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం క్రీడాపోటీలు నిర్వహించారు. పోటీలను కోరుట్ల సీఐ రాజశేఖర్ ప్రారంభించారు. ఎస్సైలు సతీశ్‌కుమార్, సుధీర్‌రావు, రామచంద్రం, పీఈటీ గంగాధర్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

జగిత్యాలక్రైం: క్రీడలతో మానసికంగా ఉల్లాసంగా ఉంటారని రూరల్ సీఐ కృష్ణకుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం మినీస్టేడియంలో బాలబాలికలకు క్రీడాపోటీలు నిర్వహించారు. రూరల్ ఎస్సై అనిల్, ఎంఈవో గాయత్రి, పీఈటీలు శ్రీనివాస్, అజయ్‌బాబు, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మల్యాలలో..

మల్యాల: మల్యాల సర్కిల్ పరిధిలోని మల్యాల, పెగడపల్లి, కొడిమ్యాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మండలస్థాయి పోటీలు నిర్వహించారు. మల్యాల ఎస్సై మంద చిరంజీవి, పీడీ విశ్వప్రసాద్, పీఈటీలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలురు, బాలికలకు కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించారు. ఏఎస్సై రాములు, సర్పంచ్ దొంతుల శ్యామల, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పొనకంటి వెంకట్, ఉప సర్పంచ్ మంగిలిపెల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

నియామకం

✦ బీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా వెంకటేశ్

జగిత్యాల: బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా దీటి వెంకటేశ్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.

✦ అంబేద్కర్ యువజన సంఘం..

రాయికల్: మండలంలోని అంబేద్కర్ యువజన సంఘం (మాల) అధ్యక్షుడిగా నీరటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గుండ భూమేశ్, కంటె విష్ణు, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శులుగా గుండ ఆనంద్, గుండ చంద్రమోహన్, కోశాధికారిగా బిట్ల గంగారం బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

✦ దివ్యాంగుల కార్యవర్గం

పెగడపల్లి: దివ్యాంగుల కమిటీ మండల అధ్యక్షుడిగా గొల్లపల్లి శ్రీధర్ ఎన్నికయ్యారు. సంఘం ఎన్నికలు బుధవారం మండల కేంద్రంలో జరిగాయి. గౌరవ అధ్యక్షుడిగా బెదిగం రాజు, ఉపాధ్యక్షుడిగా జక్కుల మల్లేశం, ఎండీ ఇమామ్, ప్రధాన కార్యదర్శిగా తడగొండ సురేశ్, సహాయ కార్యదర్శిగా మల్యాల రవి, కోశాధికారిగా రవి, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్, రజిత, రాధ, సుధాకర్‌రావు ఎన్నికయ్యారు.

గ్రామంలో అభివృద్ధి పనులు పరిశీలన


షెడ్డును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా గ్రామంలో వివిధ అభివృద్ధి పనులను అడిషనల్ కలెక్టర్ మంద మకరంద బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలోని క్రీడాప్రాంగాణం, బృహత్ పల్లె ప్రకృతివనం, నర్సరీ, వైకుంఠదామం, వర్మికంపోస్టు షెడ్‌ను పరిశీలించారు. వైకుంఠదామం వద్ద బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లను నిర్మించాలని ఆదేశించారు. రికార్డులను పరిశీలించి పంచాయతీ కార్యదర్శి రాణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్, డిప్యూటీ తహసీల్దార్ పద్మ, ఈసీ నవీన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రాణి పాల్గొన్నారు.